# మందపాటి సత్యం అందించిన ముత్యం

"వెర్రి వ్యామోహంతో అక్కడికి విరగబడ్డం తప్ప, ఈ కాలపు కుర్రాళ్ళకి ఆ అమెరికా ఏ మెరికా! అక్కడున్న పెళ్ళికాని తల్లులు ఇంకెక్కడా లేరటగా!" అని మనవాళ్ళు కొందరు పెదవి విరిస్తే, "చాల్లే! ఇక్కడ మనవాళ్ళేదో మడిగట్టుకున్నట్టు! 'బూత్‌ఫుల్'గా లేని ఒక్క టీవీగాని, సినిమాగాని చూపించు!" అని ఎదురు సవాళ్ళు మరికొందరు. ఇలాంటి ఏకపక్ష తీవ్ర విమర్శలకు తావివ్వకుండా, మౌలికమైన ఉదాత్తత అంటూ ఉంటే, ఏ దేశంలోని ఏ మామూలు మనిషైనా, మహోన్నతుడు కావొచ్చని చూపించింది గనక, ఇది మంచి నవల. అంతేకాదు. *'గౌరవంగా జీవించటమే కాదు, గుర్తుండిపోయేలా మరణించవచ్చు'* అని నిరూపించింది గనక, ఇది గొప్ప నవల కూడా!

*"ప్రకాష్! నేనిందాక ఫ్యునరల్ హోమ్‌కి ఫోన్ చేసాను. నా క్రెడిట్ కార్డు నెంబరిచ్చి, కట్టవలసిన డబ్బులన్నీ కట్టేశాను. ఈ కాగితంలో వాళ్ళ ఎడ్రసూ, ఫోన్ నెంబరూ అన్నీ వున్నాయి. అక్కడి సూపర్‌వైజర్ పేరు కూడా ఈ కాగితంలో వ్రాశాను. ఆ అవసరం రాగానే, వాళ్ళకి ఫోన్ చేయి.... పూజారిగారు వచ్చి మన పద్ధతిలో కార్యక్రమం నిర్వహిస్తారు."*

రాజు తన ఫ్రెండ్ చేతిలో ఓ కాగితం పెట్టి ఇలా రిక్వెస్ట్ చేయడం చూస్తే, ఆయన దగ్గర వాళ్ళెవరో చనిపోవటానికి సిద్ధంగావున్నారనీ, 'ఆ అవసరం' రాగానే దహనకాండ విషయంలో సహాయం కోరాడనీ అనుకుంటే అది పొరపాటు. తన అంతిమ యాత్రకి తానే ఆ ఏర్పాట్లు

చేసుకుంటున్నాడని తెలిసి, ఎంతటి గట్టి గుండె అయినా ద్రవించక మానదు.

తను చీకటిలో లీనమైపోయిన చందమామ అయినా, తన వారి బ్రతుక్కి చల్లదనం నింపిన 'రాజు' కథకి, 'చీకటిలో చందమామ' అనే పేరు సార్థకమైంది.

సందర్భం వచ్చింది గనక, ఈ నవలలోని ముఖ్యపాత్ర రాజుతో, ముప్ఫై ఏళ్ళ కిందట, ఆంధ్రపత్రిక వారపత్రికలో సీరియల్‌గా వచ్చిన నా నవల, 'సంపెంగలూ-సన్నజాజులూ'లో ప్రసాద్ శీలంతో పోల్చుకోకుండా ఉండలేకపోతున్నాను. క్షణక్షణం మృత్యువు సమీపిస్తున్నట్లు తెలిసినా 'నేను బతికే వున్నాను. బతికే ఉంటాను' అని ఎదుటి వాళ్ళను నవ్వించే ధీరోధాత్తులు ఇలాంటి వాళ్ళు.

భాషా భేదం (సుధ, సురేష్ కన్నడం వాళ్ళు, ఉన్నికృష్ణన్ మలయాళీ)గాని, విదేశీయమైన తేడాలు(అమాండా, క్రిస్ అమెరికన్లు) గాని మాటవరసకైనా స్ఫురించకుండా ఓ మనిషికి సాటి మనిషి కష్టకాలంలో చేయూతనివ్వటం చూస్తే, "ఈ ప్రపంచంలో ఇలాంటి వాళ్ళున్నారనే భావనే మనసులో మాధుర్యం నింపి, మరి నాలుగు కాలాల పాటు బతకాలనే ఇచ్ఛను ప్రసాదిస్తుంది" అనే నా నవలలోని ఆఖరి వాక్యం మళ్ళీ గుర్తుకుతెస్తున్నందుకు, నన్ను మన్నించక మీకు వేరే మార్గం ఏదీ?

పాత్ర స్వభావాల్నీ, అభిప్రాయాల్నీ వాళ్ళ మాటల్లో చెప్పడమే తప్ప, రచయిత తనకు తానుగా ఎట్టి పరిస్థితుల్లోనూ బయట పడకపోవటం ఈ నవలలోని మరో గొప్ప లక్షణం. "వీళ్ళు ఏదైనా చేయాలని అనుకోవటమే ఆలస్యంగానీ, అమలు పరచటంలో మాత్రం ఏమాత్రం వెనుకాడరు"; "అమెరికా సాంకేతికంగా ఎంత అందించిందో, భారతదేశం ఆధ్యాత్మికంగా అంత అందించింది"; "ప్రేమ, అనురాగం ఒక దేశానికీ, ఒక సంస్కృతికీ సంబంధించినవి కావు, అవి విశ్వవ్యాప్తం"; "ఈ దేశంలో డాక్టర్లు రోగితో అన్నీ ఎదురుగానే చర్చిస్తారు. ఇండియాలో అయితే రోగాన్ని గుట్టుగా వుంచి, రోగి గుండె ధైర్యం సడలిపోకుండా చూసుకుంటారు. వీటిల్లో ఏది మంచిది అంటే, దేనికదే మంచిది".

ఇలాంటి మంచి రచయితని ఇంతవరకూ పట్టించుకోనందుకు నిష్కృతిగా 'రచన' అట్ట మీద ప్రకటించిన సత్యం మందపాటిగారి పుస్తకాలన్నిటినీ వెంటనే తెప్పించుకోడం నన్ను నేను సవరించుకునే దండన. ఇంతకీ మమ్మల్ని కలిపారు కదూ, "శాయిగారూ, మీకు హాయి హాయి!"

**అవసరాల రామకృష్ణారావు** — **విశాఖపట్నం**